క్లుప్తంగా

ఆగిన సర్వర్లు..
నిలిచిన రిజిస్ట్రేషన్లు

ఆలమూరు: స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో కక్షిదారులు రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు కార్యాలయానికి విచ్చేశారు. అయితే రిజిస్ట్రేషన్ అధికారులు కేవైసీతో పాటు ప్రాథమిక వివరాలను నమోదు చేసుకున్నారు. అయితే ముద్రణకు సంబంధించిన సర్వర్లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు జరగలేదు. సాయంకాలం వరకూ నిరీక్షించిన కక్షిదారులు నిరాశతో వెనుదిరిగారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించి ఏర్పడిన సాంకేతిక లోపం వల్లే ఈ పరిస్థితి తలెత్తి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

చిత్రలేఖనం పోటీలు

పి.గన్నవరం: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మానేపల్లి శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.నాగేంద్ర ఆధ్వర్యంలో సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 41 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్పోకెన్ ఇంగ్లీష్, నాట్యం, సంగీతం, యోగా, చదరంగం, నైతిక విలువలపై విద్యార్థులకు ఆయన శిక్షణ ఇచ్చారు.

పాలవెల్లువలో
భాగస్వామ్యం చేయాలి

పి.గన్నవరం: గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయంసమృద్ధి కోసం ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న పాల వెల్లువలో మహిళలు భాగస్వాములను చేయాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పి.గన్నవరం, అంబాజీపేట మండలాల పరిధిలోని పశు వైద్య సహాయకులకు సోమవారం ఆయన పశు సంవర్ధకశాఖ పథకాల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి రాజేంద్రప్రసాద్, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ
నియోజకవర్గ సమావేశం

అంబాజీపేట: సీఎం జగన్ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం ఉదయం 9 గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నామన్నారు. అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలన్నారు.

సంక్షేమాభివృద్ధికి చిరునామా..

• ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



రావులపాలెంలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: గతంలో ఏ సీఎం చేయలేకపోయిన సంక్షేమాభివృద్ధిని రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో సీఎం జగన్ చేసి చూపించారని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా రావులపాలెం మండలం రావులపాలెంలో సచివాలయం-3 పరిధిలో చిర్ల జగ్గిరెడ్డి పర్యటించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి బాగోగులను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని కుటుంబ సభ్యులకు వివరించారు. ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని ఇచ్చిన హామీలలో 98 శాతం అమలు చేసి చూపించామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, వర్గ, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమం అందిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల గురించి తెలుసుకోవడానికి ఏ ఇంటికి వెళ్లినా ప్రజల్లో సంతోషమే కనబడుతోందన్నారు. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి కనీసం రూ.లక్ష నుండి పది లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్యవర్మ, వాడపల్లి దేవస్థానం సభ్యుడు మన్యం భాను, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు వారధులు వలంటీర్లు



ముక్కామలలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



ఖండ్రిగలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ రమాదేవి



అంతర్వేది దేవస్థానంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ మల్లిబాబు

అంబాజీపేట: వలంటీర్ వ్యవస్థ అత్యద్భుతమని ప్రజలంతా పేర్కొనడం ఆనందాన్నిస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ముక్కామల, ఇరుసుమండలలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, సర్పంచ్ అక్కిశెట్టి నాగమణిల అధ్యక్షతన వలంటీర్ల సత్కారాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌కి అంతా బాసటగా నిలవాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థను ప్రజల ముందుకు తీసుకువచ్చి దేశం మొత్తంలోనే నంబర్ వన్ సీఎంగా జగన్ నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా వలంటీర్లు చేస్తున్న కృషి గొప్పదన్నారు. ప్రతిపక్షాలు రాష్ట్రంలో జరుగుతున్న మంచిని కప్పిపుచ్చాలని అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. దానిని తిప్పికొట్టేలా వలంటీర్లు ప్రజలకు జరుగుతున్న మంచిని వారికి అందుతున్న సంక్షేమాన్ని వివరించి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు నాగాబత్తుల సత్యానందం, దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీనివాస్, ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, బండారు మల్లి, దేవరపల్లి చినబాలయోగి, దొమ్మేటి రాధా సూర్యనారాయణ, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శం

కొత్తపేట: సీఎం జగన్ ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి అన్నారు. ‘వలంటీర్లకు వందనం’ సేవా పురస్కారాలు ప్రదానంలో భాగంగా మండలంలోని వాడపాలెం, ఖండ్రిగ గ్రామాల పరిధిలో వలంటీర్లకు సత్కారం కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వాడపాలెం 2 సచివాలయాల వలంటీర్ల సన్మానం ఆర్‌బీకేలో ఆ గ్రామ కార్యదర్శి ఎస్.రాజరాజేశ్వరి అధ్యక్షతన, ఖండ్రిగ పరిధిలో వలంటీర్ల సన్మానం ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దూనబోయిన నవదీప అధ్యక్షతన జరిగాయి. ఈ సభల్లో ఎంపీపీ, జెడ్పీటీసీలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వలంటీర్లను ఉత్తమ సేవా పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు నేలపూడి భీమరాజు, పితాని లక్ష్మీతులసి, జిల్లా పార్టీ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, మండల సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టా బాబ్జి, మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, ఖండ్రిగ వీడీసీ కన్వీనర్ డీఎస్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి లేని సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. సోమవారం అంతర్వేది దేవస్థానం పంచాయతీ వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా అవార్డులు పొందిన వారిని ఎంపీపీ ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో జి.భీమారావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైర నాగరాజు, వీఆర్వో ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రావులపాలెం: గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపనలు చేశారు. సుమారు రూ.12 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.7 కోట్లతో చేపట్టనున్న జానకమ్మ రావి నుంచి ఆదిలక్ష్మి పుంత మీదుగా రావులపాలెం వెళ్లే రహదారి విస్తరణ, పటిష్ట పరిచే పనులకు, అలాగే రూ.5 కోట్లతో చేపట్టనున్న సీఆర్‌సీ రోడ్డు, చిన్న వంతెన మీదుగా పుష్కర్ ఘాట్ వెళ్లే రహదారి విస్తరణ, పటిష్ట పరిచే పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కర్రి తాతారెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి

కొత్తపేట: స్థానిక ఏనుగులమహల్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు కరెళ్ల రామాంజనేయులు (50) మృతి చెందాడు. అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామాంజనేయులు, అతని సోదరుడు కరెళ్ల సూర్యభాస్కరరావు కలసి రాజమహేంద్రవరంలో జరిగిన టీడీపీ మహానాడుకు హాజరై తిగిరి బైక్‌పై వస్తుండగా రాత్రి ఏనుగులమహల్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై ఉన్న కొబ్బరాకుపై నుంచి వెళ్లడంతో అదుపుతప్పి పడిపోయారు. రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతని సోదరుడు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని సోదరుడు సూర్యభాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.మణికుమార్ తెలిపారు.

వాస్తు విజ్ఞానచంద్రిక ఆవిష్కరణ

అంబాజీపేట: మానవ జీవితంలో వాస్తు ప్రభావం ఎంతగానో ఉంటుందని దశ, దిశ వాస్తు వల్లే కలుగుతుందని సినీ హీరో, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. పుల్లేటికుర్రులో ప్రముఖ సిద్ధాంతి కారుపర్తి నాగమల్లేశ్వరరావు స్వగృహానికి సోమవారం బాలకృష్ణ విచ్చేశారు. పుల్లేటికుర్రులో వేంచేసిన చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో మల్లేశ్వరరావు రచించిన వాస్తు విజ్ఞాన చంద్రికను బాలకృష్ణ ఆవిష్కరించారు. హీరో బాలకృష్ణ వచ్చాడని అభిమానులు, స్థానికులు పెద్ద ఎత్తున సిద్ధాంతి ఇంటికి చేరుకున్నారు. అయితే బాలకృష్ణ ఎవరినీ కలవకుండానే గుట్టుచప్పుడు కాకుండా అక్కడి నుండి వెళ్లిపోవడంతో స్థానిక ప్రజలు నిరాశ చెందారు.

విరిగిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

అయినవిల్లి: రెండు రోజులుగా విరుచుకుపడుతున్న ఈదురుగాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు విఘాతం ఏర్పడకుండా విద్యుత్ శాఖ ఏఈ హరిబాబు ఆధ్వర్యంలో అధికారులు సత్వర చర్యలు చేపట్టారు. ఈదురుగాలులకు మండలంలోని అయినవిల్లి, అయినవిల్లిలంక, చింతనలంక, మడుపల్లి, నేదునూరు, సిరిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. వీటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

చెస్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 12వ మినీ ఒలింపియాడ్ చెస్ పోటీల్లో పలువురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. సోమవారం అండర్-14 బాలుర, బాలికల విభాగాల్లో ఎం.ముని (బంగారు), సీహెచ్ ప్రియామణి (బంగారు), బి.శివ (వెండి), బి.భరత్ (వెండి) పతకాలు సాధించారు. అండర్-12 బాలుర విభాగంలో బి.హిమేష్ నీల సింహ (బంగారు), ఎం.జశ్వంత్ (వెండి), కె.కార్తికేయ(వెండి), బాలికల విభాగంలో ఎం.జెస్సీ (బంగారు), ఎ.జ్యోత్స్న పల్లవి(వెండి), ఎ.అను (కాంస్య) పతకాలు పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, వైస్‌ప్రిన్సిపాల్ పద్మనాభం, పీడీ బి.మధుకుమార్, ఎన్నారై పితాని నాగరాజు తదితరులు క్రీడాకారులను అభినందించారు.

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

పి.గన్నవరం: మమత స్వచ్ఛంద సంస్థ సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ తండ్రి డేవిడ్‌రాజు 24వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో రోగులకు తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ సోమవారం పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం భవిత కేంద్రంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన దివ్యాంగ బాలిక గుబ్బల అభనయశ్రీని రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సత్కరించి, అవార్డును అందించారు. ఆస్పత్రి వైద్యుడు అన్నాజీరావు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి బాలరాజు, నాయకులు నల్లా పెదకాపు, కడలి సత్యనారాయణ, సందీప్, వై.ప్రసాద్, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం

ఆలమూరు: విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ ప్రజలకు నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామని మండపేట ఏడీఈ జి.తిరుమలరావు అన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికై దరఖాస్తు చేసుకున్న సందర్భంగా సోమవారం ఆయన స్థానిక గణేష్ కాలనీలో పర్యటించారు. 33 కేవీ విద్యుత్ లైన్‌ను సోమవారం ఆయన పరిశీలించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరచూ సంభవిస్తున్న ఈదురుగాలులు, వర్షాల వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు సబ్ స్టేషన్లలో అదనపు సిబ్బందిని నియమించామన్నారు.

క్లుప్తంగా

టేకు సింహాసనం సమర్పణ



టేకు సింహాసనం సమర్పించిన దాతలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి కాకినాడ జిల్లా వేళంగికి చెందిన మెర్ల వెంకన్నచౌదరి–మణికుమారి దంపతులు సోమవారం రూ.1.60 లక్షల విలువైన టేకు సింహాసనాన్ని సమర్పించారు. ఈ సింహాసనాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబుకు అందజేశారు. సింహాసనానికి ప్రత్యేక పూజలతో సంప్రోక్షణ చేసిన అనంతరం దానిపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అధిష్ఠింపచేసి ఆలయ అర్చకులు దాతలతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం దాత కుటుంబానికి స్వామి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన కె.శ్రీనివాసులు–ఉషారాణి దంపతులు రూ.11,116, పెనుమంట్రకు చెందిన కె.శ్రీనివాసరెడ్డి–నాగ స్వప్న దంపతులు రూ.10,001, ఊబలంకకు చెందిన కె. శ్రీనివాసరెడ్డి–నాగమణి దంపతులు రూ.10,116, రావులపాలెంకు చెందిన ఎస్.శంకర్‌కుమార్‌రెడ్డి–విజయలక్ష్మి దంపతులు రూ.18 వేలు, పెద్దలంకకు చెందిన టి.వెంకట శివరావు రూ.10,116 విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా భారీ ర్యాలీ

- ఎమ్మెల్యేలు చిట్టిబాబు, జగ్గిరెడ్డిల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు
- జనసంద్రమైన రహదారులు
- ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ శ్రేణులు



పి.గన్నవరంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు



రావులపాలెంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, తదితరులు

పి.గన్నవరం/అంబాజీపేట: ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుగా పోలుస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అక్విడెక్ట్ వద్ద రాజశేఖర రెడ్డి, అంబేడ్కర్ విగ్రహాలకు చిట్టిబాబు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. అక్కడి నుంచి పోతవరం, ముంగండ గ్రామాల మీదుగా అంబాజీపేట మండలం ముక్కామల వరకూ ర్యాలీ సాగింది. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ పేద వర్గాలను కించపరిచే విధంగా మాట్లాడుతున్న చంద్రబాబుకు ప్రజలు మళ్లీ బుద్ధిచెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేని చంద్రబాబు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని అన్నారు. ఏఎంసీ చైర్ పర్సన్ నక్కా కృష్ణవేణి, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, కొంబత్తుల ఏసు, నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి దుర్గారావు, సాధనాల రమేష్, కటకంశెట్టి ఆదిత్య కుమార్, తులా గోపాలకృష్ణ, అడ్డగళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈ ర్యాలీ అంబాజీపేటలో మండలంలోనూ కొనసాగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ హయాంలో సేకరించిన స్థలాల్లో టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను బ్యాంకులకు తాకట్టు పెట్టిన ఘనత చంద్రబాబుదే నన్నారు. అంతకుముందు స్థానిక బస్‌స్టేషన వద్ద ఉన్న అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, గన్నవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పేరి శ్రీనివాస్, గుత్తుల నాగబాబు, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగరవపు నాగరాజు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ప్రజలే భూస్థాపితం చేస్తారు: ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం/కొత్తపేట: ప్రజలను మభ్యపెట్టేందుకు వైఎస్సార్ సీపీపై టీడీపీ చేస్తున్న దుర్మార్గ ప్రచారాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం సాయంత్రం రావులపాలెంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నిరసన ర్యాలీ నిర్వహించారు. కొత్తపేటలోని నాలుగు మండలాల నుంచి వందలాదిగా స్థానిక పార్టీ కార్యాలయానికి చేరుకుని జగ్గిరెడ్డి వెంట బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత స్థానిక సెంటరులో ఉన్న మాజీ సీఎం వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్‌పై ర్యాలీగా జొనకమ్మరావి, మందపల్లి మీదుగా కొత్తపేట షిరిడిసాయి బాబా ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి కొత్తపేట మండలంలో పది గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలసి స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని అంబేడ్కర్, వైఎస్సార్, పూలే, రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరావు, కొత్తపేట జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సాకా ప్రసన్నకుమార్, అప్పారి విజయకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండు సుబ్రహ్మణ్య వర్మ, దేవరపల్లి సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, కొత్తపేట మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచులు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు, నాయకులు పితాని రాంబాబు, కొపెల్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో సౌకర్యాలను పునరుద్ధరించాలి

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీలో అబ్దుల్‌కలాం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏసీలు నిరుపయోగంగా మారిన నేపథ్యంలో వాటిని పునరుద్ధరించి, ఇన్ పేషెంట్లకు బెడ్‌లపై దుప్పట్లు, దిండ్లు అందించాలని కోరుతూ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు సోమవారం కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతిపత్రం సమర్పించారు. తాము ఆస్పత్రిని దత్తత తీసుకుని రూ.35 లక్షలతో వివిధ రకాల సౌకర్యాలు కల్పించామన్నారు. ఇందులో భాగంగా 2017–18లో రూ.3.75 లక్షలతో ఏసీలు, బెడ్స్ ఏర్పాటు చేశామన్నారు. గత 15 రోజులుగా మూడు ఏసీలు పనిచేయడం లేదని, పేషెంట్లకు బెడ్స్‌పై దుప్పట్లు, దిండులు లేవన్నారు. ఈ కారణంగా బాలింతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఆస్పత్రి అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వెంకటేశ్వరరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మలికిపురం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మద్దూరి సతీష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరాయపురంలో విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల తొలగింపులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వివరించారు.

రోగులకు మనోధైర్యం కల్పించాలి

అంబాజీపేట: ఫ్యామిలీ డాక్టర్‌కు వచ్చే రోగులపై మెరుగైన సేవలు అందించడంతో పాటు మనోధైర్యం కల్పించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో సీహెచ్‌వీ భారతలక్ష్మి వైద్య సిబ్బందికి సూచించారు. మొసలపల్లిలో పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను, పెదగరువులో అంగన్‌వాడీ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్‌ను గ్రామాల్లో రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన సేవలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం డయాబెటిక్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డి.శిరీష, హెచ్‌వీ శాంతకుమారి, వైద్య సిబ్బంది ఎం.వెంకటేశ్వరరావు, చంద్రకళ, 104 సిబ్బంది పాల్గొన్నారు.



మొసలపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో భారతలక్ష్మి

నేడు రావులమ్మ తీర్థం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న రావులమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు పది రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను వివిధ సామాజిక వర్గాల వారు ఘనంగా సేవలు చేశారు. సోమవారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలతో పాటు కోయ డ్యాన్సులు పలువురిని ఆకట్టుకున్నాయి.

చల్లని మజ్జిగతో ఉపశమనం

అంబాజీపేట: వేసవి తాపానికి గురికాకుండా చల్లని మజ్జిగతో ఉపశమనం పొందవచ్చని సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీనివాస్, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. అంబాజీపేట బస్‌స్టేషన్ ఎదురుగా సత్యమోహన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కుసుమ శ్రీను, మట్టపర్తి హరి, చింతపల్లి వెంకటేశ్వరరావు, పితాని శెట్టి, వెన్నపు రాంబాబు, నాగాబత్తుల శశి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు రెండు అర్జీలు

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు అర్జీలు అందాయి. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, తహసీల్దార్ ఐపి శెట్టి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్పందనలో వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు. రెవెన్యూ సంబధిత సమస్యతో పాటు పారిశుధ్యంపై దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు.

బీసీలపై చంద్రబాబు కపట ప్రేమ

సఖినేటిపల్లి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తిరిగి తన మాయమాటలతో బీసీలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు, పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి పాటి శివకుమార్ అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలో ఆయన మాట్లాడారు. బీసీలను హీనంగా చూసిన బాబు ఈ రోజు అధికారం ఇస్తే బీసీల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకువస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాజమహేంద్రవరం మహానాడు వేదిక ద్వారా బాబు గుప్పించిన హామీలు బూటకమని, వీటిని ఎవరూ విశ్వసించే పరిస్థితి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు బీసీలు గట్టిగా బుద్ధి చెబుతారని ఆయన తెలిపారు.